
బురదమయంగా నజ్దిక్‌సింగారం-మీర్‌ఖాన్‌పేట రోడ్డు


చిత్తడిగా అయ్యవారిగూడ రోడ్డు

# రోడ్లు ఇలా.. ప్రయాణించేదెలా..?

- అడుగడుగునా గుంతలు
- చిన్నపాటి వర్షం వస్తే చిత్తడే..
- కంకర తేలి నరకం చూపిస్తున్న రోడ్లు
- ప్రయాణించేందుకు జంకుతున్న వాహనదారులు
- ప్యాచ్ వర్క్‌లతో సరిపెడుతున్న అధికారులు
- శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్న ప్రజలు

యాచారం, అక్టోబర్ 27 : మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే లింకు రోడ్లపై ప్రయాణం వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. ఎక్కడ చూసినా గుంతలతో కూడిన రోడ్లే దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. భారీ వర్షం కురిసిందంటే రోడ్లు చిన్నపాటి గుంతలను తలపిస్తున్నాయి. రోడ్లు ఛిద్రమవడంతో పలు చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. పరిస్థితిపై వాహనదారులు అధికారులకు విన్నవిస్తే నామమాత్రంగా ప్యాచ్ వర్క్‌లతో సరిపెడుతున్నారు. కొన్ని రోజులు కాగానే మళ్లీ యథాస్థితికి చేరుకుంటున్నాయి. రోడ్లకు శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.


కంకరతేలిన కొత్తపల్లితండా-నాగిల్ల రోడ్డు

### కందుకూరు-యాచారం రోడ్డు

యాచారం-కందుకూరు ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా మండల కేంద్రంలో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. కంకర కొట్టుకుపోయి గుంతలమయంగా మారింది. వర్షం కురిసిందంటే చాలు చిన్నపాటి కుంటను తలపిస్తున్నది. ఈ రోడ్డుపై వాహనదారులు, ప్రయాణికులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తున్నది. ఈ రోడ్డుకు ఎన్నిమార్లు మరమ్మతులు చేసినా మళ్లీ అదే దుస్థితి నెలకొంటున్నది.

### మేడిపల్లి-యాచారం రోడ్డు

మండల కేంద్రం నుంచి గాండ్లగూడ, మల్కీజ్‌గూడ గ్రామాల మీదుగా మేడిపల్లి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. ముఖ్యంగా మల్కీజ్‌గూడ వద్ద అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. మేడిపల్లి అలుగు సమీపంలో రోడ్డంతా బీటీ కొట్టుకుపోయి కంకర తేలి గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. నందివనపర్తి వెళ్లే రోడ్డు వద్ద మరింత దారుణంగా తయారైనా పట్టించుకునే నాథుడేలేడు. ఆటో డ్రైవర్లు ఆటోలు చెడిపోకుండా అప్పుడప్పుడు స్వయంగా మట్టి పోసుకొని కాలం వెళ్లదీస్తున్నారు. రాత్రిపూట ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

### మీర్‌ఖాన్‌పేట-సింగారం రోడ్డు

కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం వరకు ఫార్మాసిటీలో భాగంగా డబుల్ రోడ్డును నిర్మించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మీర్‌ఖాన్‌పేట నుంచి సింగారం వరకు మొదట్లో రోడ్డు వెడల్పు, చదును పనులు చరుకుగా సాగినప్పటికీ ప్రస్తుతం పనులకు ఒక్కసారిగా బ్రేక్ పడింది. వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షం వస్తే చాలు చిత్తడిచిత్తడిగా మారుతున్నది. బురద, లేకుంటే దుమ్ముతో నిత్యం ప్రయాణికులు, వాహనదారులు నరకం చూస్తున్నారు.

### నాగార్జునసాగ్ రహదారి నుంచి తక్కళ్లపల్లి వెళ్లే రోడ్డు

నాగార్జునసాగర్ రహదారి నుంచి తక్కళ్లపల్లికి వెళ్లే రోడ్డు శ్రావణ పవర్ ప్లాంట్ వద్ద రోడ్డుపై పెద్ద గోతి ఏర్పడింది. రాత్రిపూట గోతిని గమనించని వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుగుండా తక్కళ్లపల్లి, కొత్తపల్లి, నాగిల్ల, మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, మీర్‌ఖాన్‌పేట తదితర గ్రామాలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

### సింగారం-అయ్యవారిగూడ రోడ్డు

నజ్దిక్‌సింగారం నుంచి అయ్యవారిగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు ఛిద్రమైపోయింది. వర్షానికి బురదమయంగా మారుతున్నది. కనీసం ఆర్టీసీ బస్సు కూడా నడవలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో ఇటీవల రోడ్డుకు మరమ్మతులు చేసే వరకు బస్సును నడిపేదిలేదని ఆర్టీసీ అధికారులు బస్సును బంద్ చేశారు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ కూలీలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతుచేసి ప్రయాణికుల కష్టాలు తీర్చాలని అయ్యవారిగూడ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

### మేడిపల్లి-చరికొండ రోడ్డు

మేడిపల్లి నుంచి పల్లెచెల్కతండా మీదుగా చరికొండకు వెళ్లే రోడ్డు అడుగడుడునా గుంతలమయంగా మారింది. ముఖ్యంగా మేడిపల్లి-పల్లెచెల్కతండాల మధ్య రోడ్డంతా మరీ అధ్వానంగా ఉన్నది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. వాహనాలకు తరచూ రిపేర్లు రావడంతో మెకానిక్ షెడ్డులను ఆశ్రయిస్తున్నట్లు వాపోతున్నారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి ఎమ్మెల్యేలు దృష్టి సారించి రోడ్డుకు పూర్తిగా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

### కొత్తపల్లితండా-నాగిల్ల రోడ్డు

కొత్తపల్లి గ్రామానికి అనుబంధంగా ఉన్న కొత్తపల్లితండా నుంచి గిరిజన తండాలను కలుపుతూ నాగిళ్లకు వెళ్లే రోడ్డు నేటికీ బీటీ రోడ్డుకు నోచుకోకుండా పోయింది. ఉన్న రోడ్డు మట్టి కొట్టుకుపోయి, కంకరతేలింది. ఇటీవల వర్షానికి రోడ్డుపైకి పెద్ద బండరాయి వచ్చి పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ రోడ్డుగుండా గిరిజన తండాలను కలుపుతూ మాడ్గుల మండలం నాగిళ్ల, అప్పారెడ్డిపల్లి గ్రామాలకు ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తారు. పాలకులు స్పందించి తండాకు నూతనంగా బీటి రోడ్డును వేయాలని తండావాసులు కోరుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణించలేమని వాపోతున్నారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం సైతం నరకంగా సాగుతున్నదన్నారు.

### రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



గుంతలమయంగా మారి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్న రోడ్లను సంబంధిత అధికారులు, పాలకులు వెంటనే మరమ్మతులు చేయించాలి. యాచారం-కందుకూరు రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపించాలి. రోడ్లపై ఏర్పడిన గుంతలకు తక్షణమే ప్యాచ్‌వర్కులను చేపట్టాలి. వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. రోడ్లకు ఇరువైపులా ఉన్న కంప చెట్లు, పిచ్చి మొక్కలను సైతం తొలగించాలి. మూల మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి.


- భూతరాజు నాగరాజు, యాచారం


ప్రమాదకరంగా తక్కళ్లపల్లి రోడ్డు


గుంతలమయంగా మేడిపల్లి-యాచారం రోడ్డు


అధ్వానంగా చరికొండ-మేడిపల్లి రోడ్డు

## డీడీసీఎంసీ చైర్మన్‌గా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


చేవెళ్ల ఎంపీని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు

మొయినాబాద్, అక్టోబర్ 27: ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (డీడీసీఎంసీ)చైర్మన్‌గా చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డిని, శ్రీరాంనగర్ మాజీ సర్పంచ్ సన్‌వల్లి ప్రభాకర్‌రెడ్డిని సభ్యులుగా నియమించారు. వారిని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, చిలుకూరు మాజీ ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి, శ్రీరాంనగర్ మాజీ ఉపసర్పంచ్ మాధవరెడ్డి, నాయకులు శ్రీరాములు, వెంకట్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్‌గౌడ్, అమర్‌నాథ్‌రెడ్డి ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అభివృద్ధిలో ప్రతిఒక్కరినీ సమన్వయపరుచుకుంటూ భాగస్వాములను చేస్తానని తెలిపారు. ఎంపీ నిధులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేయడానికి జిల్లాలోని కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులందరితో కలిసి ముందుకెళ్తానని ఎంపీ చెప్పారు.

## వివేకానందుడిని అదర్శంగా తీసుకోవాలి

### ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



కంకల్‌లో వివేకానంద స్వామి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

పూడూరు, అక్టోబర్ 27 : యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పేర్కొన్నారు. ఆదివారం పూడూరు మండలం కంకల్ గ్రామంలోని శ్రీవీరభద్రస్వామి యూత్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివేకానంద దేశంలోని అనేక ప్రాంతాల్లో తిరుగుతూ.. సమాజంలో యువకులను అన్ని విధాలుగా చైతన్యపరిచే ప్రసంగాలు చేసేవారని తెలిపారు. వివేకానంద చికాగోలో సర్వమత మహాసభలో చేసిన ప్రసంగంతో అన్ని దేశాల ప్రశంసలు పొందారు. వివేకానందుడు కుల, మత, జాతి, లింగ భేదం లేకుండా ప్రతిఒక్కరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. భారతదేశం గొప్పదనాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేసిన గొప్ప వ్యక్తి వివేకానందుడని చెప్పారు. శైలజ-నాగేశ్వర్‌రావుల ఆర్థిక సాయంతో వివేకానందుడి విగ్రహం, ఇతర ఏర్పాట్లను కంకల్ గ్రామ యువకులు కలిసి ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

## టీపీఎస్‌సీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎంపిక


నూతనంగా ఎన్నికైన రాష్ట్ర పంచాయతీ సెక్రటరీస్ సెంట్రల్ ఫోరం జిల్లా కమిటీ

వికారాబాద్, అక్టోబర్ 27: వికారాబాద్ జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించేందుకు ముందుండి పోరాటం చేస్తామని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సెక్రటరీస్ సెంట్రల్ ఫోరం (టీపీఎస్‌సీఎఫ్) జిల్లా నూతన అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో టీఎన్జీవోస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన టీపీఎస్‌సీఎఫ్ వికారాబాద్ జిల్లా బాడీ ఎన్నికలు నిర్వహించారు. మధుకర్‌రెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వేమారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎస్.రమేశ్, బి.కృష్ణవేణి, జనరల్ సెక్రటరీగా ఎన్ఎం.రామ్, జాయింట్ సెక్రటరీగా ఈ.కృష్ణ, కోశాధికారిగా మల్లేశం, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా విశ్వతేజ, ఆనంద్, పబ్లిసిటీ సెక్రటరీలుగా శివసాయి, రాఘవ, దీప, కులకర్ణి, బి.కిషన్‌రెడ్డి, లీగల్ అడ్వైజర్‌గా ఎన్.బాలరాజును, ఈసీ మెంబర్లు, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.


ముళ్ల పొదలు, కలుపు మొక్కలను తొలగించిన మర్పల్లి నుంచి పంచలింగాల్ వెళ్లే రోడ్డు

## ముళ్ల పొదల తొలగింపు

### హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, మండల ప్రజలు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మర్పల్లి, అక్టోబర్ 27 : ప్రమాదకరంగా మారిన ముళ్ల పొదలు.. అనే శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా కలుపు మొక్కలు, ముళ్ల పొదలు పెరిగి ప్రమాదకరంగా మారాయి. పంచలింగాల్, తుమ్మలపల్లి, బిల్‌కల్ తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం పంచలింగాల్ మాజీ సర్పంచ్ మనీలా సురేశ్‌కుమార్ యాదవ్‌తో సంప్రదించి జేసీబీ సహాయంతో మర్పల్లి నుంచి పంచలింగాల్ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమస్యలను వెలికితీసిన నమస్తే తెలంగాణకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్లకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


మర్పల్లి నుంచి పంచలింగాల్ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు(ఫైల్)


## ప్రభుత్వ రంగ బీమా సంస్థలను బలోపేతం చేయాలి



ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభల వేదికపై అతిథులు

సిటీబ్యూరో, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ): ఎల్ఐసీతో పాటు ప్రభుత్వ రంగ బీమా పరిశ్రమకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని, ప్రభుత్వ రంగ బీమా సంస్థలను బలోపేతం చేయాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభలలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. రెండురోజులుగా దోమల్‌గూడ సుగుణాకర్ రావు భవన్ క్లెమెంట్ దాస్ ఆడిటోరియంలో జరుగుతున్న ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల 23వ సంయుక్త మహాసభలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తున్నామని, బీమా ప్రీమియంపై జీఎస్టీ ఉపసంహరించాలని, నేషనల్ మానిటైజేషన్ పైపులైన్‌ను వ్యతిరేకిస్తున్నామని, ఎల్ఐసీలో క్లాస్ 3, 4 ఉద్యోగాల నియామకం వెంటనే చేపట్టాలంటూ పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ ప్రతినిధుల సమావేశానికి ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు రమేశ్, కోశాధికారి రవి, జోనల్ నాయకులు సుజాత, టీవీఎస్ ఎన్ రవీంద్రనాథ్, ఆర్ శ్రీనివాసన్, రాజేశ్‌సింగ్, వి.మైథిలీ తదితరులు పాల్గొని మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరానికి గాను హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. హైదరాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా డి.గిరిధర్, ఉపాధ్యక్షులుగా ఝాన్సీ లక్ష్మి, రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా మద్దిలేటి, కోశాధికారిగా యాదగిరి రావు, సంయుక్త కార్యదర్శులుగా గణేశ్, రవీందర్ ఎన్నికయ్యారు. సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా గుణశేఖర్, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా రఘు, కోశాధికారిగా వివేక్ కౌశిక్ ఎన్నికయ్యారు.

## భాషా సాహిత్యంలో ప్రతిభాశాలి 'దివాకర్ల'



మాట్లాడుతున్న మండలి బీఆర్‌ఎస్ పక్ష నేత మధుసూదనాచారి

ముషీరాబాద్, అక్టోబర్ 27: విభిన్న భాషా సాహిత్యంలో ప్రతిభాశాలి దివాకర్ల వెంకటావధాని అని రాష్ట్ర శాసన మండలి బీఆర్‌ఎస్ పక్ష నేత మధుసూదనాచారి అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో నిర్వహిస్తున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా ఆదివారం సాహితీ వేత్త దివాకర్ల వెంకటావధాని సంస్మరణ సభ నిర్వహించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామసుబ్రహ్మణ్యం, రమణ వెలమకన్ని, గానసభ పాలకమండలి సభ్యుడు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో రెండో దశకు ముందడుగు

**కేబినెట్ ఆమోదంతో కేంద్రానికి చేరిన డీపీఆర్**

- అంచనా వ్యయం రూ.24,269 కోట్లు
- కేంద్రం నిర్ణయంపైనే మెట్రో భవిత
- 5 కారిడార్లలో 76.4 కి.మీ నిర్మాణం



సిటీబ్యూరో, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): ఎట్టకేలకు హైదరాబాద్ మహానగరంలో రెండో దశ మెట్రో ప్రాజెక్టుకు మరో అడుగు ముందుకు పడింది. నగరం విస్తరిస్తున్న కొద్దీ ట్రాఫిక్ రద్దీ పెరగడంతో ఇప్పుడున్న మెట్రోను ఇతర మార్గాలకు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందుకు సంబంధించిన డీపీఆర్‌లకు శనివారం రాత్రి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. రెండో దశలో 5 మార్గాల్లో మొత్తం 76.4 కి.మీ మేర నిర్మించే మెట్రో ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.24,269 కోట్లు కాగా, అందులో 30 శాతం రూ.7,313 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, 18 శాతం రూ.4,230 కోట్లు కేంద్ర ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంటుంది. మెట్రో రెండో దశను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు కొంత మేర పీపీపీ విధానంలో చేపట్టనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల తర్వాత డీపీఆర్‌ను హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ సిద్ధం చేసింది. కొన్ని నెలలుగా ప్రతిపాదిత మెట్రో మార్గాల్లో మార్పులు, చేర్పులు చేసి చివరకు రెండో దశలో 76.4 కి.మీ మార్గాలను ఖరారు చేశారు. జూన్,జూలై నాటికే డీపీఆర్‌లను పూర్తి చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఫోర్త్ సిటీ పేరుతో ఎంతో కాలయాపన చేసింది. రెండోదశలో మెట్రోలోనే ఫోర్త్ సిటీ మెట్రో మార్గాన్ని 40 కి.మీ మేర నిర్మిస్తామని ప్రకటించిన, చివరకు దాన్ని పక్కన పెట్టింది.

### కేంద్రం సహకరించేనా...?

హైదరాబాద్ మహానగరంలో చేపట్టే మెట్రో రైలు ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి తప్పని సరి. అనుమతులన్నీ కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 5 మెట్రో కారిడార్‌లకు ఆమోదం ఉంటుందా అన్నది తేలాల్సి ఉంటుంది. అనుమతులకు తోడు కేంద్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులను సైతం కేటాయించాల్సి ఉంటుంది. ప్రాజెక్టు నిర్మాణానికి ఒకేసారి రూ.24,269 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేయడంతో, ఆ స్థాయిలో నిధులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో ఎంత సమయంలో ఈ ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తుందోనన్న అనుమానం వ్యక్తమవుతున్నది. దేశంలోని వివిధ మెట్రో నగరాల్లో నిర్మిస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులతో పాటు వేలాది కోట్ల నిధులను కేటాయిస్తున్నా, అవి రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే కేటాయిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో రెండో దశకు కేంద్రం ఎంత వరకు సహకరిస్తుందో వేచి చూడాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వద్ద మెట్రో ప్రాజెక్టుకు సరిపడా నిధులు కేటాయించలేని పరిస్థితి. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే ప్రాజెక్టును చేపట్టాల్సి ఉంటుంది.

**రెండో దశలో డీపీఆర్ సిద్ధం చేసిన మెట్రో మార్గాలు..**

- నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు 36.8 కి.మీ.
- రాయదుర్గం-కోకాపేట నియోపోలీస్-11.6 కి.మీ
- ఎంజీబీఎస్- చాంద్రాయన్‌గుట్ట- 7.5 కి.మీ
- మియాపూర్- పటాన్‌చెరువు - 13.4 కి.మీ
- ఎల్‌బీనగర్ - హయత్‌నగర్ - 7.1 కి.మీ

## ఓబీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి


ఆర్.కృష్ణయ్యకు సన్మానం చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ సంఘం నేతలు

రవీంద్రభారతి, అక్టోబర్ 27: దేశ వ్యాప్తంగా ఓబీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, బీసీ మంత్రిత్వ శాఖను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, పూర్వ ఎంపీ ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని, బీసీలపై క్రీమీలేయర్ ఎత్తివేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు లేని క్రీమీలేయర్‌ను బీసీలకు ఎందుకు పెట్టారని కేంద్ర ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించి బీసీలకు తీరని నష్టం చేస్తున్నదని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై పునరాలోచించి బీసీ రిజర్వేషన్లలో కోతను నివారించాలన్నారు. ప్రైవేట్ రంగంలో కూడా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ వ్యక్తి ఇప్పటి వరకు సుప్రీం కోర్టు జస్టిస్ కాలేదని, దేశవ్యాప్తంగా ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు బీసీలు మూడు శాతం కూడా లేరని ఆయన చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ తెలంగాణ సర్కిల్ అధ్యక్షుడు కె.అనిల్ కుమార్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సర్కిల్ సెక్రటరీ ఎస్.శివకృష్ణ, అసోసియేషన్ నేతలు ధర్మరాజు, విజయ్ కుమార్, కె.సురేశ్, నరేశ్‌తో పాటు జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు పాల్గొన్నారు.